


# ఒప్పుకున్న తప్పు


ఎమ్. హరా

ఇంటికి వేసివున్న తాళాన్ని చూసి ఆశ్చర్యపోయాడు శంకరం. అంతలో యింటి వోనరు అతనికి తాళంచెవులు ఇస్తూ అన్నాడు. "ఇప్పుడే కాంపునుంచి వస్తున్నారా? మీ మిసెస్ బెజవాడ వెళ్లారు."

తలుపులు తెరిచి యింట్లోకి వెళ్తూ 'సుమ బెజవాడ యెందుకు వెళ్ళింది చెప్మా—' అని ఆలోచిస్తున్న శంకరం చూపులు టేబిల్ మీది ఉత్తరంపై బడ్డాయి.

అతని గుండె గుభేలుమంది. ఏదో కీడు శంకిస్తూ ఆ ఉత్తరాన్ని చదవసాగాడు. పునః పునః చదివాడు. అది సుమతి రాసిన ఉత్తరం.






"చలపతీ" అంటూ కోపంగా పిడికిళ్ళు బిగించాడు. "సుమా" అని మూగగా రోదిస్తూ పిచ్చిగా ఒకసారి జుత్తుని పీక్కున్నాడు. ఉన్మాదిలా ఆ గదిలో రెండుక్షణాలు తచ్చాడి కిటికీ లోంచి బయటికి చూడసాగాడు కింకర్తవ్యమూఢునిలా.

మామిడి చెట్టు కొమ్మమీది కాకి వుండి వుండి వికారంగా అరుస్తున్నది. మల్లె పందిరిని అందుకోవాలని మేకలు ఎగురుతున్నాయి. ముద్ద మందారాల పూలమొక్కల పాదుల్లో పందులు తమ ముట్టెలతో నేలని తొలుస్తున్నాయి. నీళ్ళు లేక గులాబీ మొక్కలు ఎండిపోతున్నాయి. తమ కింక రక్షణ లేదని పశువులకి బలైపోతున్నాయి మొక్కలు.

శంకరం అనాలోచితంగా ఆకాశంలోకి చూశాడు.

చండప్రచండంగా మండుతున్న సూర్యుణ్ని చూడలేక దృష్టిని మళ్ళించి వెనక్కి తిరిగాడు. కిటికీ తలుపులు మూసేశాడు. కాని తన గుండెల్లో మండుతున్న మంటని భరించలేక విల విల్లాడిపోతూ 'సుమా....సుమా, అని రోదిస్తూ సుమతి ఫోటోవంక చూస్తూ 'సుమా ....నన్నెందుకిలా అన్యాయం చేశావ్....నైతికంగా పతనం చెందిన దుర్మార్గుణ్ని కావచ్చును. కాని నువ్వు దేవతవి .... నువ్వు దేవతవి 'సుమా'.... ఎందుకింత దారుణంగా నీ దారిని నిర్ణయించుకున్నావ్........నీ ప్రమేయం యేమాత్రం లేని చిన్న తప్పుని పెద్దగా వూహించుకొని యెందుకింత పెద్ద శిక్ష విధించుకున్నావ్....?....'

* * *

"నువ్వు దేవతవి....అందుకే నే నెన్ని తప్పుడు పనులు చేసినా చిరునవ్వుతో సహిస్తావు....నీ వోర్పుని చూసి భూదేవి అసూయ పడుతున్నది."

"మీరు నన్ను మాటలతో బాగా మురిపిస్తారు:" అంటూ శంకరం బూట్లు పాలిష్ చేస్తూ ముంగురుల్ని సవరించుకుంటున్నది సుమతి.

"చేతలతో మురిపించాలంటే ఈ రోజు శనివారమంటావు. లేకపోతే ఏకాదశి అంటావు. తిధి వారనక్షత్రాలు చూసి నిన్ను మురిపించే ఓపిక నాకు లేదు....యిప్పుడు నాతో క్లబ్‌కి రా....నీ పూజలతో, వ్రతాలతో ఎప్పుడో చచ్చిన

తరువాత లభించబోయే స్వర్గాన్ని చిటికెలో చూపిస్తాను" అంటూ విలాసంగా సిగరెట్ వెలిగించాడు శంకరం.

"మళ్ళీ సిగరెట్ వెలిగిస్తున్నారా?"

"ఐ కాంట్ బ్రీత్ విత్ అవుట్ సిగరెట్. నేను సిగరెట్ లేకుండా గాలి పీల్చలేను" అంటూ గొంతుని వొత్తుకొంటున్న టైని సర్దుకున్నాడు.

"అవునవును....బ్రాంది గొంతులో పడితే గానీ మీకు మాట పెగలదు. సిగరెట్ లేకపోతే మీ శ్వాస ఆగిపోతుంది——" వ్యంగ్యంగా, నిష్ఠూరంగా అంటూ అతని కాళ్ళదగ్గర బూట్లు పెట్టింది.

"వెల్ సెడ్ మై డియర్....వైఫ్ అంటే యిలా వుండాలి. మీరు పేకాట ఆడితే నేను నెత్తిమీద కిరసనాయిల్ పోసుకొని అంటించుకుంటాను; మీరు బ్రాందీ తాగితే నేను ఎండ్రిన్ తాగుతాను; మీరు గరల్‌ఫ్రెండ్స్‌తో తిరిగితే నేను బావిలోపడి చస్తాను....అనే పాతకాలపు స్త్రీవి నీవు కాదు" అంటూ సాక్స్ వేసుకొని "అలా అని....నా భర్త శ్రీరాముడు కానప్పుడు నేను సీతగా యెందుకు వుండాలని బరి తెగించిన యీ యుగసంధి స్త్రీవీ కాదు" అంటూ బూట్ల లేసులు బిగించసాగాడు శంకరం.

అతనికి కోటు అందిస్తూ "నేను ఆదికాలపు మనిషిని....పాత చింతకాయ పచ్చడిని——" అంటూ పేలవంగా నవ్వింది సుమతి.

"చాలా చక్కని వుపమానం చెప్పావు....సుమా....అఁ....పాత చింతకాయ పచ్చడా? అయితే యెప్పుడో వొకప్పుడు నీ అవసరం నాకు వస్తుందంటావు....అంతేనా——" అంటూ అద్దంలో చూసుకుంటూ క్రాఫ్ దువ్వుకో సాగాడు.

"నా అవసరం మీకు రావలని నే నెప్పుడూ కోరుకోను. అటువంటి అదృష్టాన్ని నేను మనసా, వాచా వాంఛించను. మీరు ఆరోగ్యంగా, ఆనందంగా వుండాలని సదా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వుంటాను."

"నువ్వు వ్రతాలూ నోములు, పూజలు చేస్తున్నంతకాలం నాకేం ఫరవాలేదు....క్లబ్‌కి వేళ అయింది....వెళ్తున్నాను....ఈ రాత్రికి ఇంటికి రాను....టా....టా"అంటూ ముందుకు సాగాడు.

"వెళ్తున్నాను....అని అనకూడదు. వెళ్ళి వస్తా ననండి" అంది సుమతి నిర్జీవంగా అతని వంక చూస్తూ.

"ఓ....కే....వస్తాను——" అంటూ వెళ్ళిపోయాడు.


కనుమరుగై పోతున్న భర్తని చూస్తూ కన్నీళ్ళు తుడుచుకుంది సుమతి. తన భర్త యిక మారడు. తాను యెన్నో విధాల బ్రతిమాలింది. ఏడ్చింది. ప్రయోజనం శూన్యం. చచ్చిపోతానని బెదిరించింది. ఈ దేశంలో 'గుండెలమీద కుంపట్లు' చాలా వున్నాయి అంటూ తన బెదిరింపుని అతి సులభంగా కొట్టి పారేశాడు. అవును అతను చెప్పినది నిజమే. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. ఏదో బరువు దించుకోవాలనే ధోరణిలో ఆడపిల్లని ఒక జడపదార్థంలా, గుండెలమీద కుంపటిలా చూస్తారుగానీ ఆమెకీ వొక మనస్సూ, ప్రాణం, ఆశలు గట్రా వుంటాయని ఆలోచించరీ తల్లిదండ్రులు.

తన విషయంలో నాన్న ఎంత తొందర పడ్డారు. కాపురానికి వెళ్ళవలసిన పిల్లే గదాని, చదువుకుని ఉద్యోగాలు చేయాలా? వూళ్ళేలా అని 'చాకలిపద్దు' చదువు చెప్పించారు.అయిదు వేల కట్నంతో తనని శంకరానికి దానమిచ్చారు. తన పెళ్ళికి ముందే శంకరం గురించి చాలా చెడ్డగా విన్నారు నాన్న. వయస్సులో వున్న కుర్రాడు. మన మా వయస్సులో మడి కట్టుకుని వున్నామా? పెళ్ళి చేస్తే అన్నీ సర్దుకుపోతాయి——అంటూ పెళ్ళిపెద్దలు నాన్నకి సర్ది చెప్పారు. నాన్న వాళ్ళ మాటలకి లొంగిపోయారు.

నాన్నని అనుకుని ఏం లాభం? తనకీ భర్తని రాసిపెట్టేడు భగవంతుడు. అనుభవించాలి తప్పదు. అతని దృష్టిలో స్త్రీ ఒక ఆటవస్తువు. అందుకనే అతన్ని ఎక్కువకాలం తాను ఆకట్టుకోలేక పోయింది. అతని చెడు తిరుగుళ్ళని








అరికట్టలేక పోయింది. స్త్రీ పై భౌతికంగా వ్యామోహం పెంచుకున్నవాళ్ళకి భార్యపై ప్రేమ ఎంతకాల ముంటుంది? అందుకే తనని కాదన్నాడు. పాత చింతకాయ పచ్చడని తనని ఎద్దేవా చేశాడు.

తనకీ జీవితంలో ఒక అచ్చటా లేదు. ముచ్చటా లేదు. ఏదో వేళకింత వుడకేసుకోవడం తినడం నిద్రపోవడం. లేకపోతే పూజలు, వ్రతాలు నోములు అంటూ మనసుని మళ్ళించడం. చంపుకోవడం. అంతకన్నా తనేం చేయగలదు? తాను చదువుకోలేదు. ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి స్వతంత్రంగా బ్రతకలేదు. ఈ అయిదు వేల కట్నంతో నాన్న చదువు చెప్పిస్తే తాను హాయిగా ఉద్యోగం చేసుకునేది. స్వేచ్ఛగా గాలి పీల్చేది. అదృష్టముంటే పెళ్ళి చేసుకునేది. తానిప్పుడేం చేయగలదు? కాయకష్టం చేసుకుని బ్రతుకుదామనుకుంటే ఈ ప్రపంచం స్త్రీని వొంటరిగా బ్రతకనిస్తుందా? తన జీవితానికి భద్రత వుంటుందా? పుట్టింటివారు తనని పోషించే పరిస్థితిలో లేరు. యిక తాను ఎక్కడికి వెళ్తుంది. లభించిన జీవితంతో రాజీపడడం మినహాయించి తానేమీ చేయలేదు.

## 2

"క్లబ్‌కి వెళ్ళలేదని సంతోషిస్తే ఈ పేకాట భాగోతం యింట్లోనే మొదలెట్టేరా?" అంటూ గత రాత్రి జరిగిన సంఘటనల్ని తలచుకుంటూ ప్రశ్నించింది సుమతి.

"బెడ్‌రూం తలుపులన్నీ బిడాయించుకుని పడుకున్నావుగా .... నీకు నిద్రపట్టలేదా?" అన్నాడు వ్యంగ్యంగా శంకరం.

"ఏం నిద్ర పడుతుంది? మీ తాగుడు మాటలు వింటూంటే...." గతరాత్రి తాను విన్నమాటలు గుర్తుకురాగా అసహ్యంతో వొణికిపోయింది.

"అయితే రాత్రి నిద్రపోకుండా తలుపు చాటునుంచీ మా మాటలు వింటూనే వున్నావన్నమాట."

"నాకేం అంత కర్మ పట్టలేదు. అరచేతుల్తో గుండెని పట్టుకొని పడుకొన్నాను. నేను అసలు రాత్రి నిద్రపోలేదు. మీకు పుణ్యం వుంటుంది. దయచేసి మీ స్నేహితుల్ని మనింటికి ఆహ్వానించి పార్టీలు యివ్వకండి. నేను మిమ్మల్ని కోరుకునే వొకే వొక వరం యిది. ఈ ఇంటిని క్లబ్‌గా మార్చకండి. బయట మీ యిష్టం వచ్చి

నట్లు తిరగండి. నాకేం అభ్యంతరంలేదు. ఈ యింట్లో మాత్రం ఎటువంటి అల్లరి చేయవద్దు. నాకున్న కొద్దిపాటి మనశ్శాంతిని దూరం చేయవద్దండీ...." అంది రుద్ధకంఠంతో సుమతి.

"ఏం....ఏమయిందని యిప్పుడు? 'నాకు తెలుసు....నువ్వు నోషల్‌గా వుండలేవు. నువ్వొక గబ్బిలానివి. మొన్న రాత్రి చలపతి యింట్లో అరుణ....అదే చలపతి మిసెస్...."

అతని మాటలకి అడ్డు వస్తూ "చలపతి ఇంట్లో జరిగిన శృంగార కలాపాల్ని వినే సిగ్గుమాలిన తనం భగవంతుని దయవలన నాకింకా అలవడలేదు" అంది ఉక్రోషంగా.

జుగుప్సాకరమైన అటువంటి సంఘటనలు గురించి ఎందుకింత గొప్పగా చెప్పుకుంటారో ఆమెకి పాలుపోవడం లేదు.

"నోర్ముయ్....నేనేం సిగ్గుమాలిన పనులు చేయడంలేదు. తినడం .... తాగడం....అనుభవించడం....తప్పుడు పనులు కావు."

"ఆ పనులన్నీ నా కళ్ళముందు చేయవద్దని ప్రార్థిస్తున్నాను. నాకు మీరేమీ యివ్వనవసరం లేదు. గుప్పెడు మెతుకులు చాలు. నా భర్త మీరనే అండ చాలు....నాకింకేం అవసరం లేదు" అంటూ కన్నీరు తుడుచుకుంది సుమతి.

"ఇప్పుడు ఏమయిందని....ఆ కన్నీళ్ళు?" విసుక్కున్నాడు.

"మీ సరదాలీ యింట్లో కొనసాగిస్తే నా జీవితానికి భద్రత వుండదు...."

"నిన్న రాత్రి నువ్వు మంచినీళ్లు అందిస్తూంటే చలపతి నీ చెయ్యి తాకాడని భయపడుతున్నావా?"

సుమతి దిగ్భ్రాంతిచెందింది. ఆమె ముఖంపై రంగులు మారాయి. ఏ విషయాన్నైతే తాను చెబుదామనుకుంటున్నాదో అది అతనికితెలుసు. తెలిసినా అదే మంత పెద్ద విషయంలా భావించడం లేదు. తాను మంచినీళ్ళగ్లాసు టీపాయ్ మీద పెడుతూంటే పొంచివుండి మీదికి వురికిన పులిలా అతని చేతులు తన చేతిని కాజేసినాయి.

"అతని చెయ్యి తగలగానే నువ్వేమీ మైలపడిపోవు. దీనికింత కంగారుపడవలసిన పని లేదు. అతను తలచుకుంటే అప్సరసలు క్యూలో నిల్చుంటారు. నీలాంటి 'చింతమొద్దు' చెయ్యి లాగవలసిన కర్మ అతనికి లేదు. నిన్న క్లబ్‌కి శెలవు కాబట్టి మన యింటికి వచ్చాడు గానీ...." అని పైకి బింకంగా ఏదేదో అంటున్నా లోలోన భయపడుతున్నాడు శంకరం. ఉప్పు నీచాలు లేని వెధవ చలపతి. తన దగ్గరున్న డబ్బుకి దాసోహమని తనవెంట కుక్కలా తిరుగుతున్నాడు. వాడికి ప్రతీరోజూ 'బుడ్డి' పార్టీలు కావాలి. పైగా స్త్రీ దాహంకూడా హెచ్చే. వాడి అవసరాలకోసం రంభలాంటి భార్యని తార్చేస్తున్నాడు. తనక్కూడా స్వాధీన పరిచాడు. కొంపతీసి సుమతిపై కన్నువేయ లేదు గదా....ఆ అల్పుడు. అయినా సుమతి అటువంటి మనిషికాదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని సుమతి ప్రశ్నించేసరికి "ఆఁ....ఏంలేదు....ఏంలేదు.... చలపతికి మద్రాసు ట్రాన్స్‌ఫర్ అయింది.... అందుకే నిన్న పార్టీ యిచ్చాను....ఇంకెప్పుడూ మనింట్లో పార్టీలు ఇవ్వను" అన్నాడు శంకరం ఏదో ఆలోచిస్తూ.

## 3

పోస్టుమాన్ యిచ్చిన కవరు విప్పి చదివింది సుమతి.

సుమా డియర్,


చాలా రోజుల తరువాత. నేను క్షేమం. ఇరవై రోజులనుంచి నీకు ఉత్తరం రాయలనుకుంటూనే ఆలస్యం చేశాను. క్షమించు. నాకోసం బెంగ పెట్టుకున్నావా? నీ పూజలూ, వ్రతాలే నన్ను రక్షిస్తాయి. నిన్ను చూడాలని వుంది. సిగ్గుపడుతున్నావా? బాధపడుతున్నావా? ఈసారి నాలో వచ్చిన మార్పుని చూసి నువ్వే ఆశ్చర్యపోతావు. అపును వెంటనే రెక్కలు గట్టుకుని నీ ముందు వాలాలని వుంది. కానీ ఇక్కడ ఆఫీసు పని తెమలడంలేదు. కాంపు నుంచి ఇంకో పదిరోజుల్లో వస్తున్నాను. నీ అవసరాలకి 'చెక్' పంపిస్తున్నాను. నీకు కష్టం కలిగిస్తే క్షంతవ్యుడ్ని. అంతకన్నా ప్రస్తుతానికి యింకేం రాయలేను.

ఆశీస్సులతో నీ ప్రాణం శంకరం.

ఆ వుత్తరం చదవగానే ఉక్కిరి బిక్కిరయింది సుమతి. ఆమెకి ఆనందం; దుఃఖం వొకేసారి వచ్చాయి. ఆమె కాపురానికి వచ్చాక భర్త దగ్గరనుంచి యింత ఆదరణ ఎప్పుడూ లభించలేదు. శంకరంలో కలిగిన మార్పుకి ఆమె ఆశ్చర్యపడుతున్నది. ఆ ఉత్తరాన్ని గుండెలకి హత్తుకుంది. 'నిన్ను చూడాలని వుంది' అనే వాక్యాన్ని పునః పునః చదివింది. అతనికి ఉత్తరం రాయాలని కాంపు ఎడ్రెస్ కోసం ఆ వుత్తరమంతా వెతికింది. ఆ వుత్తరంలో 'మద్రాస్' అని మినహాయించి యిక ఎటువంటి ఆధారం ఆమెకి దొరకలేదు. కాసేపు నిరుత్సాహపడి తిరిగి బలాన్ని పుంజుకుని మంచంమీద పడుకుని తిరిగి ఆ వుత్తరాన్ని చదవసాగింది.

అంతవరకూ అకాశంనుంచి నిప్పులు కురిపిస్తున్న సూర్యుడ్ని నల్లటి మేఘాలు కమ్మేసినాయి. వాతావరణం చల్లపడింది.

కిటికీ తలుపులు టపటప కొట్టుకుంటూంటే ఉలిక్కిపడి లేచింది సుమతి. చల్లటిగాలి ఆమె శరీరాన్ని తాకింది. చక్కిలిగింతలు పెట్టినట్లయింది ఆమెకి.




## 4

శంకరం వస్తూనే సుమతిని తన కౌగిట బంధించి "సుమా....నన్ను క్షమించు....నేను చేసిన తప్పుడు పనులని మన్నించు....యిక నేనెక్కడికీ వెళ్ళను....క్లబ్‌కి పోను....పేకాట ఆడను....తాగను....ఆఫీసు .... యిల్లు....నాకు వేరే లోకంలేదు....నిన్ను విడిచి నేనెక్కడికీ వెళ్ళను సుమా" అంటూ ఆవేశంగా ఆమెని చుంబించాడు.

"యిక ఎప్పుడూ నన్ను విడిచి వెళ్ళరుగా" అంటూ అశ్రుసిక్త నయనాలతో ప్రశ్నించింది సుమతి.

"నో....నో .... వెళ్ళను .... సుమా .... వెళ్ళను" అంటూ ఆమె పెదవుల్ని మృదువుగా స్పృశించాడు.

o o o

....సుమా శిక్ష నీకుకాదు, నాకు....నాలాంటి పాపిష్టివాడు యిటువంటి శిక్ష అనుభవించవలసినదే అంటూ చేతుల్ని టేబులుమీద బలంగా కొట్టి సుమా....నువ్వు వెళ్ళిపోయావా? నాకు

దూరంగా వెళ్ళిపోయావా? నాకు అందనంత దూరం వెళ్ళిపోయావా అని ఉద్రేకంతో ఎగసి పడుతున్న గుండెల్ని అదుముకుంటూ వంకర టింకర అక్షరాలతో సుమతి రాసిన వుత్తరాన్ని చదువుకోసాగాడు శంకరం.

మహారాజశ్రీ....శ్రీ వారి పాద పద్మములకు నమస్కరించి వ్రాయునది.

యింతవరకు మీరు పాడిన పాటకీ ఆడిన ఆటకీ ఎంతమాత్రం నేను అడ్డు పెట్టలేదంటే అది నా గొప్పతనంకాదు. సహనం అంతకన్నా కాదు. అది నా చేతకానితనం. అసమర్థత. మిమ్మల్ని విడిచి ఎక్కడకీ వెళ్ళలేక, దారి తెన్నూ, తెలీక మీ యింటి పనిమనిషిలా గుప్పెడు మెతుకులకోసం మీ నీడలో కాలం వెళ్ళబుచ్చాను. నాకూ మనసు వుంది. కోరికలున్నాయి. ఆశలున్నాయి. కాని తెగింపులేదు. అందుకే దొరికిన జీవితంతో రాజీపడ్డాను.

యిక అసలు విషయానికి వస్తున్నాను. పది రోజుల్లో వస్తున్నట్లు మద్రాస్‌నుంచి మీరు జాబు రాశారు. ఆ ఉత్తరాన్ని చదువుకుని మైమరిచి పోయాను. ఎండి మోడైపోయిన నా జీవితం మీ చల్లని ఉత్తరంతో వూపిరి పోసుకుని చిగురించింది. నా మనసులాగా బయట వాతావరణంకూడా చల్లబడింది. నా మేను పులకరించింది ఆ చల్లగాలికి. మీగురించి వెచ్చని వూహాలు నాలో చోటుచేసుకున్నాయి. బయట భోరున వర్షం కురుస్తున్నది. నాలో ఉద్రేకం పెరుగుతున్నది. అంతవరకు నేను అదిమిపెట్టిన కోర్కెలు కిటికీ రెక్కల్లా టపటపా కొట్టుకుంటున్నాయి. నాకు వూపిరి సలపడం లేదు. ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలిలా నన్ను చుట్టబెట్టేశాడు చలపతి. అతను ఎప్పుడు వచ్చాడో తెలీదు. నేను అతని కౌగిలిలో పోరాడుతూనే వున్నాను. అతనిపై పిడుగులు కురిపించి మెరుపులా తప్పించుకుంటూనే వున్నాను. యింటివాళ్ళు లేరు. పెళ్ళికి వెళ్లారు. నా ఆర్తనాదం ఎవరికీ వినిపించకుండా జోరున వాన: నేను భోరున ఏడుస్తూనే వున్నాను కురుస్తున్న వానలా. అతనే గెలిచాడు!

వాన వెలిసింది. ఎండ వచ్చింది. నాపై అతను జరిపిన అత్యాచారం తలుచుకుని కుమిలి కుమిలి ఏడ్చాను. రోజులు గడుస్తున్నాయి. మీరు కాంపునుంచి వచ్చారు. మీ కౌగిలిలో సర్వస్వం మర్చిపోయాను. మీరు చెడు స్నేహాలకి స్వస్తి పలికారు. ఆఫీసు, యిల్లు, యిక వేరే లోకం లేదు. నాతో గుడికి వచ్చేవారు. మీతో సినిమాలు చూసేదాన్ని. నాకు జీవితంపై ఆశపుట్టింది. అందుకే చలపతి నాపై జరిపిన అత్యాచారాన్ని మీకు చెప్పలేదు, అనవసరంగా ఆపదలు కొని తెచ్చుకోవడ మెందుకుని జీవితంపై వుండే మమకారంతో మవునంగా వూరుకున్నాను.

అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే అది జీవితంకాదు. మీరు నాతో సినిమాలకీ గుళ్ళకి వచ్చినా మనం స్నేహితులుగానే వున్నాం. దానికి కారణం మీకు ఆరోగ్యం బాగులేదని మందులు వాడుతున్నట్లు నన్ను మభ్యపెట్టేరు. నా కడుపులో చలపతి పాపం పెరుగుతున్నదని తెలీగానే నేను భయపడ్డాను. ఇది నేను తెలిసి చేసిన తప్పుకాదు. నాకు జీవితంపై వ్యామోహం రోజురోజుకి పెరుగుతున్నది. ఈ నా తప్పుని వొప్పుగా చలామణి చేసుకునే స్థితిలో నేనున్నాను. నేను సంసారం చేసే స్త్రీని. యిప్పుడు యదార్థం చెప్పి అనేక అనర్థాలను కావాలను కొని తెచ్చుకోవడం అవివేకంగా భావించాను. నాకిప్పుడిప్పుడే మీ సహచర్యంలో కొత్తజీవితం లభించింది. ఏదో విధంగా జీవించాలనే తాపత్రయం, తెగింపు నాలో చోటు చేస్తుకున్నాయి. అందుకే అనేక కట్టుకథలు అల్లి మీకు చెప్పాను, మీరు మద్రాసునుంచి వచ్చిన రోజు రాత్రి వొళ్ళు తెలీని ఉద్రేకంతో నా దగ్గరకి వచ్చినట్లు మిమ్మల్ని నమ్మించాను. నా కడుపులో పెరుగుతున్నది మీ బిడ్డేనని. మిమ్మల్ని వంచించాను. నా లాంటి వంచకురాలు ఈ భూప్రపంచంలో వుండదు. మీరు పొంగిపోయారు. నన్ను డాక్టర్‌కి చూపించారు. మందులు కొన్నారు.

నాలుగు రోజుల క్రితం మీరు ఆఫీసు పని మీద బొంబాయికి వెళ్ళారు. మళ్ళీ వచ్చాడు చలపతి. పట్టపగలు అందరూ చూస్తూ వుండగా వచ్చాడు. నా నోట మాటరాలేదు. వస్తూనే అర్జంటుగా నాలుగువేలు కావాలన్నాడు. నా కాపురం గుట్టుగా సాగాలంటే వెంటనే డబ్బు యివ్వమన్నాడు. అతని బెదిరింపులకి నేను లొంగలేదు. నువ్వు యదార్థం చెప్పినా మా ఆయన నమ్మరు అన్నాను.

వాడు విషపు నవ్వు నవ్వుతూ నేను మీకు చెప్పిన కట్టుకథని విప్పేసి అసలు కథ చెప్పేశాడు. చలపతి చెప్పిన కథ వింటూంటే నా చెవులు దిబ్బెళ్ళు పడినాయి. వొళ్ళంతా చెమటలు పట్టేయి. నోట మాట రాలేదు. నేను చేసిన తప్పుపని తెలిసకూడా పల్లెత్తి వొక మాటకూడా అనకుండా నన్ను క్షమించగల ఔదార్యం మీకు వుంది. కాని మీలాంటి ఉన్నతుని సానుభూతి స్వీకరించగల స్థితిలో నేను లేను. జీవితంపట్ల గల మక్కువ నన్నీ స్థితికి దిగజార్చింది. సంసారిని కదా నా తప్పు వొప్పుతుందనుకుంటే చలపతి నా కళ్ళు తెరిచాడు. నాకిప్పుడు మీ కళ్లలోకి చూసే ధైర్యం లేదు. ఎంత గుప్తంగా వుంచారీ విషయాన్ని. మీకు మద్రాస్‌లో ఏక్సిడెంట్ అయిందా? మేడ మీద నుంచి క్రిందికి పడ్డారా? నెలరోజులు అక్కడే ట్రీట్‌మెంట్ తీసుకున్నారా? మీరిక సంసారానికి పనికిరారనే చేదు నిజాన్ని నాకు చెప్పకుండా నా కట్టుకథలని ఎంత తియ్యగా నమ్మారు. రాయడానికి నాకు మాటలుకూడా రావడంలేదు. నిజంగా మీరు దేవుడులాంటి వారు. మీ ముందు నిల్చునే అర్హత నాకు లేదు. నేను అల్పురాలిని. అందుకే నిష్క్రమిస్తున్నాను. ఈ ప్రపంచానికి దూరంగా పోతున్నాను. మీ మంచితనాన్ని భరించలేని నేను మీకు అందకుండా వెళ్తున్నాను. నా గురించి మీరు బాధపడవద్దు. నేను మీకిక కనబడను. ఈ జీవితాన్నుంచి తప్పుకుంటున్నాను. మీరు నా శవాన్ని చూడడానికి కూడా రావద్దు. నా వంటి పాపాత్మురాలికి నయవంచకురాలికి నిష్కృతి లేదు. దయచేసి నా ఆఖరి కోరిక కాదనకండి. నా శవాన్నికూడా చూడకండి. అప్పుడుకాని నా ఆత్మకి శాంతి లభించదు. ఎంత తీయనైనది జీవించాలనే కోరిక? యిక వుంటాను.

అనేక వేల నమస్కారాలతో మీ పాదదాసి
సుమతి.

ఉత్తరం చదవడం పూర్తిచేసి రుద్ధ కంఠంతో "సుమా....నన్ను నువ్వు అపార్థం చేసుకున్నావ్. చలపతి మళ్ళీ మన జీవితంలో ప్రవేశిస్తాడని నేను అనుకోలేదు. నేను తెలిసి చేసిన అనేక తప్పుడు పనులని నీవు సహించావు. నన్ను క్షమించావు. నీ ప్రమేయం ఏ మాత్రం లేని, పరిస్థితుల ప్రాబల్యంవల్ల నీవు మోసపోయావు. ఆ విషయం నాకు తెలుసు. నీ కళ్ళల్లోని అమాయకత్వం, జీవితంపట్ల నీకున్న మక్కువ నన్ను ఆకర్షించింది. నీలో తప్పు పట్టగల గొప్పవాడిని నేనుకాదు. అయినా నేడు అటువంటి తప్పులు వొప్పులుగా చెల్లుబడి అవుతున్నాయి. కట్టుబాటులు, నీతి నియమాలు స్త్రీ, పురుషులకి వేరువేరుగా వుండకూడదు. నేను, తిరుగుబోతునని తెలిసికూడా మీ నాన్న నిన్ను నాకు కట్టబెట్టాడు. పురుషుడు నైతికంగా చెడిపోయినా ఫరవాలేదు. ఏమిటీ ద్వంద్వ నీతి. అందుకే నీ మాటల్ని నమ్మాను. నా భార్యగా నిన్ను గౌరవించాను ....ప్రేమించాను....కాని చలపతి మన సంసారంలో నిప్పులుపోశాడు.. అందుకు కారణం నేనే. నేను చేసిన పాపాలే నన్ను కాటువేశాయి....సుమా....సుమా...." అంటూ బయటికి పరిగెత్తాడు శంకరం.